కథ

# పుకారు

వాణిశ్రీ

కృష్ణప్రసాద్ అమెరికా నుంచి ఇండియా వచ్చేశాడు. శ్యామల ఆత్మహత్య చేసుకోవడంతో అతని మనసు వికలమైంది. సూపర్ ఇగో ఉన్నవాళ్లతో సంసారం చాలా కష్టం. వాళ్లు పట్టిన కుందేలుకి మూడే కాళ్లు. వాళ్లు అనుకున్నది జరగాల్సిందే. దేవుడు దిగి వచ్చి చెప్పినా వినరు. వాల్మీకి వంటి వేటగాడు సాధువుగా మారొచ్చుగానీ సూపర్ ఇగోతో ఉన్నవాళ్లు జీవితాంతం వేటగాళ్లుగానే ఉంటారు.

శ్యామల ఆత్మహత్య చేసుకోవడానికి అసలు కారణం లేదు. కేవలం పట్టుదల, మూర్ఖత్వం. శ్యామల డెలివరీకి తన తల్లిని పిలిపిస్తానని కృష్ణప్రసాద్ అన్నాడు. అందుకు శ్యామల ఒప్పుకోలేదు. తన తల్లిని పిలిపిస్తానని పట్టుపట్టింది. అత్తగారు తులసమ్మంటే అతనికి ఏమాత్రం ఇష్టం లేదు. ఇరవై నాలుగు గంటలు గొప్పలు చెప్పుకోవడమే. తమది గొప్ప వంశమనీ, తమ తాత ముత్తాతలు మహానుభావులనీ, తను చిన్నప్పుడు నేల మీద నడవలేదనీ, జిల్లాలో కలెక్టర్‌కీ తమకీ తప్ప వేరే ఎవరికీ కారు లేదనీ, తను మంచినీళ్లు బదులు కమలాఫలం జ్యూస్ తాగి పెరిగిందనీ, ఈ విధంగా బోర్‌కొడుతుంది. ఇంటికి ఎవరైనా వచ్చారో తులసమ్మకి బలైపోవాల్సిందే. అంతేకాకుండా తమ స్టేటస్‌కి ఈ సంబంధం సరితూగదనీ, ఏదో కుర్రాడు చదువుకున్నాడు, అమెరికాలో ఉద్యోగం అంటే ఇచ్చామనీ నిస్సంకోచంగా చెప్తుంది.

అందులోనూ డెలివరీకి వస్తే ఆరునెలలు ఉంటుంది. ఆరునెలల పాటు కృష్ణప్రసాద్‌కి నరకమే. అందుకే అత్తగారి రాకని తీవ్రంగా వ్యతిరేకించాడు. అంతేకానీ శ్యామల అంత చిన్న కారణానికే ఆత్మహత్య చేసుకుంటుందని ఊహించలేకపోయాడు. తర్వాత బెంగుళూరులో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాయినైపోయాడు. తల్లిదండ్రులు శ్రీశైలంలోనే ఉండిపోయారు.

"ముప్ఫై ఐదేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం కదరా! మరి ఎక్కడా ఉండలేం. ఈ ప్రశాంత వాతావరణం వదలి సిటీల్లో ఉంటే ఉక్కిరిబిక్కిరైపోయి ఊపిరాడనట్లుగా ఉంటుంది. మమ్మల్ని ఇక్కడే ఉండనీ" అన్నాడు నరసయ్య. నరసయ్య శ్రీశైలం ప్రాజెక్టులో అటెండర్‌గా పనిచేసి రిటైరయ్యాడు.

తండ్రి చెప్పిన మాటా నిజమే. నల్లమల కొండల్లో ఆ అడవి మధ్య సున్నిపెంట కాలనీలో తన బాల్యం ఎంత మధురంగా గడిచిందో కృష్ణప్రసాద్‌కి గుర్తుంది. చిన్నతనపు తీపిగుర్తులు జీవితమంతా గుర్తుంటాయి.

బెంగుళూరు నుంచి నెలకొకసారైనా శ్రీశైలం వెళ్లి వస్తున్నాడు కృష్ణప్రసాద్. తను చిన్నతనంలో ఆడుకున్న కాలనీ, చదువుకున్న స్కూలు, అప్పుడప్పుడు తనతో పాటు చదువుకున్న స్నేహితులు తారసపడినప్పుడు గుర్తు తెచ్చుకునే జ్ఞాపకాలు, శ్రీశైలం గుడికి వెళ్లి ఆ ప్రాకారాల మీద ఉన్న శిల్పాలు ఫోటోలు తీసుకోవడం అన్నీ అతనికి సంతోషాన్నిస్తున్నాయి.

కానీ చిన్నతనంలోనే అతనికి భార్య వియోగం కలగడం, మళ్లీ పెళ్లి మాట తలపెట్టకపోవడం నరసయ్య దంపతులకు ఆవేదన కలిగిస్తున్నాయి. కాలం కలిసొస్తే మళ్లీ పెళ్లి చేసుకుంటాడేమోననే ఆశతో జీవిస్తున్నారు.

ఒకరోజు కృష్ణప్రసాద్ గుడికి వెళ్లడానికి బయల్దేరాడు. కారు ఎక్కి కూర్చుని స్టార్ట్ చేస్తుండగా "కృష్ణా!" అనే పిలుపు వినిపించింది.

'తననేనా? లేక భ్రమపడుతున్నాడా?' అనుకున్నాడు.

ఆమె కారు దగ్గరకు వస్తోంది. ఆమె చేతిని పట్టుకుని ఐదేళ్ల పాప నడుస్తోంది.

కృష్ణప్రసాద్ కళ్లు పెద్దవి చేసి చూశాడు.

విరజ!

"కృష్ణా! బాగున్నావా? ఎప్పుడొచ్చావు? యు.యస్.లో ఉంటున్నావటగా?" అన్నది కారు పక్కనే నిలబడి.

"నేనిప్పుడు యు.యస్‌లో ఉండడం లేదు. బెంగుళూరులో ఉంటున్నాను" అన్నాడు ఆమెనే తదేకంగా చూస్తూ.

"ఔనా!" అన్నది.

"ఎక్కడికి బయల్దేరావు?" అడిగాడు.

"గుడికి."

"నేనూ అక్కడికే. కారెక్కు" అన్నాడు డోర్ తెరుస్తూ.

విరజ ఫ్రంట్ సీట్‌లో కృష్ణప్రసాద్ పక్కనే కూర్చుంది.

"ఈమధ్య నీ ఫ్రెండ్ హరి కనిపించాడు. లండన్‌లో డాక్టరటగా?"

"ఔను."

"తను చెప్పాడు నీ మిసెస్ సూసైడ్ చేసుకుందని, నేను చాలా బాధపడ్డాను. ఐయామ్ సారీ! ఎలా జరిగింది?" అడిగింది విరజ.

కృష్ణప్రసాద్ జరిగిందంతా చెప్పాడు. అంతా విని విరజ నిట్టూర్చింది.

గుడికి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు విరజని వాళ్ల క్వార్టర్ దగ్గర డ్రాప్ చేశాడు.

విరజ కారు దిగి "లోపలకు రా కృష్ణా!" అన్నది.

"వద్దులే! నన్ను చూస్తే మీ ఫాదర్‌కి బి.పి రైజవుతుంది" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"అదంతా పాత కథ. అప్పుడాయన పవర్‌ఫుల్ ఆఫీసర్. రిటైరైపోయాక చప్పబడిపోయాడు. అదీగాక ఆయనకు పక్షవాతం వచ్చింది" అన్నది విరజ.

"సారీ విరజా! తెలియక ఏదో అన్నాను. పద. ఒకసారి పలకరించి వస్తాను" అని కారు దిగాడు.

జగ్గారావు హాల్లోనే సోఫాలో కూర్చుని ఉన్నాడు. మనిషి చాలా తగ్గిపోయాడు. మూతి వంకరపోయి ఉంది. ముఖంలో ఆనాటి కళ లేదు. ఒకప్పుడు పెద్దపులి మాదిరి గాంభీర్యంగా ఉండేవాడు.

"బాగున్నారా!..." అంటూ వెళ్లి జగ్గారావు ఎదుట కూర్చున్నాడు కృష్ణప్రసాద్.

"ఎవరూ?..." అంటూ కళ్లు పెద్దవి చేసి చూశాడు.

కృష్ణప్రసాద్ చెప్పబోతుండగా జగ్గారావు భార్య పార్వతి వచ్చి "కృష్ణప్రసాదండీ. నరసయ్య కొడుకు. ఇప్పుడు అమెరికాలో ఉంటున్నాడు" అని భర్తకి చెప్పింది.

"నువ్వా!..." అన్నాడు జగ్గారావు నిర్లిప్తంగా.

"బాగున్నావా కృష్ణా! ఆయనకు చూపు కూడా తగ్గిపోయింది. నీటికాసులో... ఏదో అంటున్నారు. ఆపరేషన్ చేయించాలి. కళ్ల డాక్టరేమో మద్రాస్ వెళ్లి శంకర్ నేత్రాలయలో చేయించుకోమంటున్నాడు" అన్నది పార్వతి.

"ఔనండీ! సౌత్ ఇండియాలో ఫేమస్ హాస్పిటల్ అది" అన్నాడు కృష్ణప్రసాద్.

"మా పరిస్థితి ఏం బాగాలేదయ్యా! దాని బతుకు అట్లా అయ్యింది" అని కళ్లనీళ్లు పెట్టుకుంది పార్వతి.

కృష్ణప్రసాద్ ఇబ్బందిగా కూర్చున్నాడు.

"నీ భార్య సూసైడ్ చేసుకుందటగా! ఆమధ్య హరి వచ్చాడు. అతను చెప్పాడు. అప్పటివరకు మాకూ తెలియదు" అన్నది పార్వతి సానుభూతిగా.

విరజ కాఫీ కప్పు చేతికి అందించి పక్కనే కూర్చుంది. తల్లి పక్కనే కూర్చుని తధేకంగా కృష్ణప్రసాద్‌నే చూస్తోంది కీర్తి.

"కీర్తీ ఈయన ఎవరో తెలుసా నీకు?" అన్నది పార్వతి మనుమరాలితో.

"డాడీ" అన్నది కీర్తి.

కృష్ణప్రసాద్ ఉలిక్కిపడ్డాడు. విరజ తండ్రి వైపు చూస్తోంది.

"తప్పమ్మా! అంకుల్" అన్నది పార్వతి.

"కాదు డాడీనే" గట్టిగా చెప్పింది కీర్తి.

కృష్ణప్రసాద్ కాఫీ త్రాగి లేచి నిల్చున్నాడు.

"వెళ్లొస్తాను సార్!" జగ్గారావుని చూస్తూ అన్నాడు కృష్ణప్రసాద్.

జగ్గారావు తల ఊపాడు.

"వెళ్లొస్తాను ఆంటీ" అన్నాడు పార్వతితో.

"అప్పుడప్పుడూ వస్తూ ఉండు" అన్నది పార్వతి.

కృష్ణప్రసాద్ గేటు తీసుకుని బైటకు వచ్చాడు. విరజ కారు వరకూ వచ్చింది.

"నువ్వు చెప్పేవరకూ నాకు తెలీదు విరజా, ప్రభా

కర్ పోయాడని. ఎలా జరిగింది?" అన్నాడు కృష్ణప్రసాద్.

"ఏవుంది? బాగా తాగుతాడు. తాగి డ్రైవింగ్ చేస్తూ యాక్సిడెంట్ చేశాడు. స్పాట్ డెడ్" తల వంచుకుని అన్నది విరజ.

"పాపం కీర్తి డాడీనే కలవరిస్తోంది. తనకి తెలీదు ఇక డాడీ లేడని" సానుభూతితో అన్నాడు.

"భయపడుతుందని కీర్తిని డెడ్‌బాడీ చూడనివ్వలేదు. నిన్నే డాడీ అనుకుంటోంది. చాలా కాలమైందిగా ప్రభాకర్‌ని చూసి" అన్నది విరజ.

"డాడీ...!" అంటూ కారు దగ్గరకి పరిగెత్తుకొచ్చింది కీర్తి.

కృష్ణప్రసాద్ కీర్తిని ఎత్తుకున్నాడు.

"రా..కీర్తీ!" అన్నది విరజ చేతులు చాచి.

"ఉహూ... నేను డాడీతో వెళ్తాను" మారాం చేసింది.

"డాడీ మళ్లీ వస్తారుగా!..." అని బ్రతిమాలుతోంది విరజ.


చుట్టుప్రక్కల క్వార్టర్స్ వాళ్లు కృష్ణప్రసాద్‌ని, విరజనూ ఆసక్తితో గమనిస్తున్నారు. విరజ కీర్తిని బలవంతంగా తన చేతుల్లోకి తీసుకుంది. కీర్తి ఏడుస్తోంది. కృష్ణప్రసాద్ మనసంతా వికలమైపోయింది. పసి పిల్లలకు తండ్రి లేని లోటు ఎంత గాఢంగా ఉంటుందో తెలిసింది అతనికి.

* * *

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కూతురు విరజ. ఇంటర్ వరకు కృష్ణప్రసాద్ క్లాస్‌మేట్. ఆ తర్వాత కృష్ణప్రసాద్ ఇంజనీరింగ్‌లో చేరితే, విరజ కర్నూలులో బి.యస్సీలో చేరింది. ఎమ్‌సెట్‌లో ర్యాంక్ రాకపోవడంతో మెడిసిన్ చేయాలన్న ఆమె కోరిక తీరలేదు. సెలవుల్లో శ్రీశైలం వచ్చినప్పుడు ఇద్దరూ కలుసుకునేవాళ్లు. డ్యామ్ సైట్లో, గుడిలో కబుర్లు చెప్పుకుంటూ సెలవులు గడిపేవాళ్లు. సున్నిపెంట కాలనీ అంతా పల్లెటూరు వాతావరణం. అందరి విషయాలు, అందరికీ తెలిసిపోతుండేవి. అంతా ఉద్యోగులు. ప్రతీరోజూ కలుసుకునేవారు కాబట్టి ఏ విషయం తమ దృష్టికి వచ్చినా కనిపించినవారికంతా చెప్పేవారు. అలా మౌత్ పబ్లిసిటీ జరిగేది.

కృష్ణప్రసాద్, విరజ కలసిమెలసి తిరుగుతూ ఉండడంతో వారిద్దరూ ప్రేమించుకుంటున్నారని అంతా అనుకోసాగారు. అందులో అబద్ధం ఏమీ లేదు. చదువు పూర్తయ్యాక కృష్ణప్రసాద్ హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరాడు. విరజ తన తల్లితో కృష్ణప్రసాద్‌ని పెళ్లి చేసుకుంటానని చెప్పింది. కృష్ణప్రసాద్ అందగాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. పైగా అమ్మాయి అతన్ని ప్రేమిస్తోంది. కాదనడానికి ఆమెకు కారణం కనిపించలేదు. కానీ జగ్గారావు మండిపడ్డాడు. అతనికి అగ్ర కులం వాడిననే అహంకారంతో పాటు, ఆఫీసర్‌నని గర్వం కూడా.

"ఆఫ్టాల్ వాడు అటెండర్ కొడుకు. వాడి కులం



ఏమిటి? మన స్టేటస్ ఏమిటి?" అని భార్య మీద మండిపడ్డాడు.

"అవన్నీ ఎందుకు? అమ్మాయి అతన్ని ప్రేమిస్తోంది. అతనికేం తక్కువ? మీకంటే ఎక్కువే సంపాదిస్తున్నాడు" అన్నది పార్వతి.

"నోర్ముయ్! దానికేం తెలుసు? పసిపిల్ల. వయసులో అదొక ఎట్రాక్షన్. ఆ భ్రమ ఎంతసేపు ఉంటుంది. పెళ్లయితే అన్నీ మర్చిపోతుంది. దేనికైనా సరిసమానులతో వ్యవహారాలు ఉండేట్టు చూసుకోవాలి. కులం తక్కువ వాడిని అల్లుడిగా చేసుకుంటే బంధువులంతా 'ఛీ' కొడతారు" అన్నాడు జగ్గారావు.

ఆ తర్వాత జగ్గారావు జీప్ వేసుకెళ్లి నరసయ్యని ఇంటి బైటకు రమ్మని కేకలు పెట్టాడు. అంత లావు ఆఫీసర్ తన ఇంటికొచ్చి కేకలు వేసేటప్పటికి హడిలిపోయాడు నరసయ్య.

జగ్గారావు జేబులో నుంచి రివాల్వర్ తీసి "నర్సయ్యా! నీ కొడుకుని అదుపులో పెట్టుకో. నా కూతుర్ని ప్రేమిస్తున్నానని వెంటబడుతున్నాడంట. జాగ్రత్త! ఈసారి నా కూతురి వెంట పడితే కాల్చిపారేస్తాను" అని హుంకరించాడు.

"తెలియక పొరపాటు జరిగి ఉంటుంది సార్! నేను వాడిని మందలిస్తాను సార్! క్షమించండి సార్!"

అన్నాడు నరసయ్య వణికిపోతూ.

ఆ తర్వాత విరజను బంధువుల కుర్రాడు ప్రభాకర్‌కి ఇచ్చి వైభవంగా పెళ్లి చేశాడు.

గతమంతా గుర్తొచ్చి కృష్ణప్రసాద్‌కి నిద్ర పట్టలేదు. ఏమిటో తన బతుకు ఇలా అయింది. విరజ జీవితం నాశనమైంది. మోడులైన తమ బతుకులు చిగురిస్తాయా? ఏమో? అనుకున్నాడు.

* * *

విరజ, తను ఒకే బోటులో ప్రయాణం సాగిస్తున్నారు. ఎప్పటికైనా ఏకమయ్యే అవకాశం ఉంది అని ఆశ కలుగుతోంది కృష్ణప్రసాద్‌కి. శ్యామలతో పెళ్లి, కాపురం, ఆమె ఆత్మహత్య అంతా పీడకలలా తోస్తోంది. గతమంతా మర్చిపోవాలి అనుకున్నాడు.

బెంగుళూరు నుంచి నెలకొకసారి వచ్చేవాడు లోగడ. ఇప్పుడు పదిహేను రోజులకొకసారి వస్తున్నాడు. కీర్తి కోసం బెంగుళూరు నుంచి ఎన్నో ఆటబొమ్మలు కొనుక్కొచ్చేవాడు. విరజను, కీర్తిని కారులో ఎక్కించుకుని తిప్పేవాడు. విరజ కూడా దిగులు, విచారం నుంచి కోలుకుంది. ఆమె ముఖం కాంతివంతమైంది. కళ్లల్లోకి వెలుగొచ్చింది.

అప్పుడప్పుడు విరజ కృష్ణప్రసాద్‌ని తమ ఇంట్లో లంచ్ చెయ్యమనీ, డిన్నర్ చెయ్యమనీ బలవంతం చేసి తీసుకెళ్తోంది. జగ్గారావు ఇప్పుడు ఏమీ అనడం లేదు. జరిగేదంతా చూస్తూ ఊరుకుంటున్నాడు. తన కూతురు జీవితంలో మళ్లీ వసంతం వస్తే బాగుండుననే కోరిక ఉంది పార్వతికి. కానీ కృష్ణప్రసాద్ మనసులో ఏముందో? అతను కేవలం కీర్తి కోసమే వస్తున్నాడేమో? తండ్రి లేని పిల్లని జాలి పడుతున్నాడేమో? అనే సందేహం పీడిస్తోంది.

విరజను అడగాలనుకుంటుంది. కానీ ధైర్యం చాలడం లేదు. పెళ్లిమాట ఎత్తితే ఏ ముఖం పెట్టుకుని అతన్ని అడుగుతాం అంటుందేమో? మగవాడు భార్య పోయిన తర్వాత మళ్లీ పెళ్లి చేసుకోవడం మామూలే. కానీ ఆడదానికి అలా కాదు. విధవను వివాహం చేసుకోవడానికి ఎంతో హృదయ వైశాల్యం కావాలి. అది అతనికి ఉందా?

కృష్ణప్రసాద్ కేవలం స్నేహితుడిలా విరజతో మెలుగుతున్నాడు. కీర్తి సంతోషం కోసమే అతను వస్తున్నట్లుగా ఆమె అర్థం చేసుకుంటోంది. కీర్తి డాడీ అని అతన్ని పిలుస్తుండడం అతనికి సంతోషం కలిగిస్తూ ఉండొచ్చు అనుకుంటోంది విరజ. భవిష్యత్తు గురించి వాళ్లేమీ మాట్లాడుకోవడం లేదు.

విరజకు దగ్గరవ్వాలని కృష్ణప్రసాద్ మనసులో కోరిక ఉంది. కానీ పాత సంఘటనలు గుర్తొచ్చి జంకు కలుగుతోంది. జగ్గారావుకి పంతాలు, పట్టుదలలు ఎక్కువ. జబ్బున పడి నిస్సహాయమైన స్థితిలో భార్య, కూతుళ్లపై ఆధారపడి బతుకుతున్నాడు కాబట్టి తన రాక సహిస్తున్నాడు. లేకపోతే తనను గుమ్మం తొక్కనిస్తాడా?

ఒకరోజు సున్నిపెంటలో బార్‌షాపు ఓనర్ రాఘవరెడ్డి కృష్ణప్రసాద్‌ని రమ్మని పిలిచాడు.

"నాకు అలవాటు లేదోయ్" అన్నాడు కృష్ణప్రసాద్.

"అందుకు కాదులేవోయ్. నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలని పిలిచాను" అన్నాడు రాఘవరెడ్డి.

"ఏంటోయ్ సంగతులు?" అడిగాడు కృష్ణప్రసాద్.

"నువ్వు ఏమనుకోకు. కాలనీలో అంతా అనుకుంటున్నారు" అన్నాడు రాఘవరెడ్డి.

"ఏ విషయం?"

"జగ్గారావుగారి అమ్మాయి విరజ విషయం."

కృష్ణప్రసాద్ నవ్వి "అనుకునేది ఏముంది? లోగడ మేమిద్దరం ప్రేమికులం" అన్నాడు.

"అది కాదు."

"మరేమిటి?"

"విరజ కూతురు నీకు పుట్టిందని అంతా అనుకుంటున్నారు. ఆ పిల్లతో నిన్ను డాడీ అని కూడా పిలిపిస్తున్నదటగా!"

"వాట్?" అదిరిపడ్డాడు కృష్ణప్రసాద్.

"ఔనోయ్! లోగడ మీరిద్దరూ ప్రేమించుకున్నారనీ, విరజ గర్భవతి అయిందనీ, నీతో పెళ్లికి జగ్గారావు ఒప్పుకోక బంధువుల కుర్రాడికిచ్చి పెళ్లి చేసి పంపేశాడనీ అనుకుంటున్నారు" చెప్పాడు రాఘవరెడ్డి.


"అదంతా పుకారు. మేమిద్దరం ప్రేమించుకున్న మాట నిజం. కానీ అంతకుమించి ఏమీ జరగలేదు. ప్రామిస్" చెప్పాడు కృష్ణప్రసాద్.

"నీ మాట నమ్ముతాను. కానీ అంతా అలా అనుకుంటున్నారు" అన్నాడు రాఘవరెడ్డి.

కాసేపు అక్కడే కూర్చుని వికలమైన మనస్సుతో ఇంటికి బయల్దేరాడు కృష్ణప్రసాద్.

* * *

నెలకు రెండుసార్లు బెంగుళూరు నుంచి శ్రీశైలం వెళ్లే కృష్ణప్రసాద్ నెల రోజులు దాటినా వెళ్లలేదు. అతను ఆత్మవిమర్శ చేసుకుంటున్నాడు. మళ్లీ తను తప్పటడుగు వేస్తున్నాడా? ఈ దాగుడుమూతలు ఎన్నాళ్లు? ఈ పుకారు విరజ చెవిన పడి ఉంటుందా? ఆమె ఎలా ఫీలవుతున్నది? పార్వతికి తెలిస్తే ఎంత బాధపడుతుందో? ఆమె మీద అపనిందలు పడడానికి తను కారణమయ్యాడా? నిప్పు లేనిదే పొగ రాదు గదా అనుకుంటారు గదా?




విరజ ఒకరోజు ఫోన్ చేసింది.

"కృష్ణా! నెల దాటిపోయింది. రావడం లేదేమిటి?"

"ఏం లేదు. ఆఫీసులో బిజీ. అంతే" అన్నాడు.

"కీర్తి డాడీ.. డాడీ.. అని కలవరిస్తోంది."

"వచ్చే శనివారం తప్పకుండా వస్తాను" అన్నాడు.

"నీకోసం ఎదురుచూస్తుంటా" అన్నది విరజ.

కృష్ణప్రసాద్ చెవులకు విరజ మాటలు వీనులవిందుగా ఉన్నాయి. అతని గుండె లయతప్పింది. విరజ కళ్లల్లో మెదులుతోంది. కీర్తిని ఎత్తుకుని ముద్దులాడాలని పిస్తోంది.

కొడుకు ఇంట్లోకి రాగానే సీతమ్మ అడిగింది.

"నిజం చెప్పరా! విరజకు పుట్టింది నీ కూతురేనా?"

కృష్ణప్రసాద్‌కి కోపం వచ్చింది. అడిగింది తల్లి కాబట్టి కోపం అణుచుకున్నాడు. ఆ పుకారు తన ఇంటికి కూడా వచ్చిందన్నమాట అనుకున్నాడు.

"ఐతే ఏంటి?" సీరియస్‌గా అన్నాడు.

సీతమ్మ తెల్లబోయింది.

* * *

విరజకు ఆ పుకారు గురించి చెప్పాడు కృష్ణప్రసాద్. విరజ నవ్వింది.

"నాకు తెలుసు" అన్నది.

"ఆ పుకారు నిజం చేద్దాం" అన్నాడు.

"ఎలా?"

"పెళ్లి చేసుకుని."

విరజ అతని దగ్గరగా వచ్చి కౌగిలించుకుంది. కృష్ణప్రసాద్ ఆమెను హృదయానికి హత్తుకున్నాడు. చీకటిని చీల్చుకుంటూ చంద్రుడు కొండల్లోంచి ఉదయిస్తున్నాడు.

కృష్ణప్రసాద్, విరజ గుడిలో స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. మెడలో పూలదండలతో ఇంటికి వచ్చిన దంపతులను చూసి పార్వతి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. హారతి ఇచ్చి ఇంట్లోకి ఆహ్వానించింది.

కొత్త దంపతులు జగ్గారావు కాళ్లకి నమస్కరించారు. పార్వతి అక్షింతలు అతని చేతిలో పెట్టింది. అక్షింతలు వేసి వాళ్ల తలలు నిమిరాడు.

"సారీ కృష్ణా!" అస్పష్టంగా గొణుగుతున్నట్లు అన్నాడు జగ్గారావు. అతనిలో ఇప్పుడు అహంకారం, గర్వం మచ్చుకు కూడా లేవు.

★